ప్రబోధం

శ్రీమతి ఎమ్. లక్ష్మీదేవి

కమలను నమలి మింగేద్దామన్నంత కోపం సుందరానికి. అంత కోపానికి కారణం కమల తన కెదురాడిందని. అసలు ఈ గోల ఎందుకు వచ్చిందంటే కమల నీళ్ళపొయ్యి రా జేసి నీళ్ళు చేదుతూంది - సుందరం "కాఫీలో పంచదార చాల్లేదు. కాస్తవెయ్యి" అన్నాడు. కమల "నీళ్లు చేదుతున్నాను. ఆ డబ్బాలో ఉంది. వేసుకోండి" అని జవాబిచ్చింది పెరట్లోంచి. ఆ జవాబువిని మళ్ళా సుందరం అధికార దర్పంతో, "ఏయ్! ఎన్నిసార్లు చెప్పాలేమిటి? చెవుడా? కాస్త పంచదార వేసి పొమ్మంటె ... నా మాటంటె నీకు అలక్ష్యంకదూ!" అని గదమాయించాడు.

కమల అసలే రోషవతి. అందులో ఇన్ని మాటలు సహించి ఊరుకుంటుందా?

"ఔనులెండి - మీ కాలికింద దాసీదానిలాగ పడిఉన్నాను కాబట్టి అనరాని మాట లంటారు. ఈ విధంగా ఏడ్పించడానికే గాబోలు నన్ను పెళ్ళిచేసుకొన్నది. చేయరానిచాకిరి ఏధనవంతుల ఇంట్లో పుట్టిన పిల్ల మీకు చేస్తుందీ" అన్నది.

మాటకుమాట ముదిరింది. సుందరం ఏదో అల్పవిషయానికి కమల నెందుకనాలని ఊరుకున్నాడా అంటే-లేదు. చాలా పట్టుదలకల మనిషి. అందరిలాగ భార్య మాటలకు లోబడే వాణ్ణికాదని డంబాలు కొట్టుకొనేవాడు. సాధారణంగా ఊరుకోలేడు. కమల ధనవంతుల ఇంట్లో పుట్టింది. తాబట్టిన కుందేటికి మూడేకాళ్ళన్న రకం మనిషి.

తన కోపంతీర నోటికొచ్చినట్లెల్లా అన్నాడు సుందరం. కమల కన్నీళ్ళతో వంటింటికి వెళ్ళిపోయింది. తల్లిదండ్రుల వాగ్వాదాన్ని చూస్తూన్న రఘు మెల్లిగా దేకుతూ ఒకమూల కూర్చొని కళ్లు నులుపుకొంటూ బిక్కమొగంతో చూస్తున్నాడు. సుందరం బయటి చావడికొచ్చి బల్లమీదున్న పుస్తకాలను చిందరవందరగా విసరి ఫౌంటెన్ కలముతీసి ఏదో వ్రాయబోయాడు, కాని అందులో సిరా లేదు కాబట్టి అది వ్రాయలేదు. మఱింత కోపం హెచ్చింది. విసరి టేబిలుమీద పారేసి చేతిని చెంపమీద పెట్టుకొని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

కమల వంటింటికివెళ్లి పొయ్యి ఊదింది. అది మండలేదు. మళ్లా ఊదింది. కాని పొయ్యి మాత్రం మండలేదు. కోపం రగులుక వచ్చింది. ఒక చెంబు

నీళ్లు తెచ్చి పొయ్యిలోపోసి 'షెల్ఫు' నాను కొని ఏడుస్తూ నించుంది.

కమల, సుందరంలు అన్యోన్యంగా నాలుగేండ్లుగా సంసారం చేస్తున్నారు. కాని ఇంతవరకు గృహ కల్లోలం, కలహం అంటె ఏమిటో ఎరుగరు. సుందరం ఇంత వరకు కమలను ఒక్కమాటయైన అన లేదు. కమల ఎదిరించిందీలేదు. కర్మం చాలక ఇవాళ ఇద్దరూ ఒక కలహంలోకి దిగారు.

తొమ్మిదిన్నరైంది. పదిగంటలకు ఆఫీసు కెళ్ళాలి సుందరం. ఇంకా వంట కాలేదు. ఒకరితో నొకరు మాట్లాడమని మనస్సులో శపథం చేసుకొన్నారిద్దరూను.

గాలి తరంగాల్లో మధురమైన గంధర్వ గానం వినిపించింది. భార్యా భర్తలకు పరస్పరమున్న ద్వేషమును మనస్సు మర్చి పోయి ఆ గానంలో లీనమైంది. సన్నటి కోకిలలాంటి మధుర స్వరం హార్మోని యంతో మనోహరంగా అమరిపోయింది.

వీధి గుమ్మందగ్గరి కెళ్లాడు సుందరం. వెనుకనే రఘు నెత్తుకొని కమల వచ్చింది. ఒక మురికి చింపి పరికిణీ కట్టుకొని, చిని గినగుడ్డ పమిటవేసుకొని ఆ రేండ్లపిల్ల పుష్పం తన సౌరభాన్ని వెదజల్లి తుమ్మెద లను ఆకర్షించేటట్లు తన మధురమైన కంఠ ధ్వనితో అందరి హృదయాలను ఆకర్షించు కొంది. ఆ పిల్లచుట్టు జనం మూగారు.

"వృథాకలహము మాని ప్రేమతో సంసారము నడుపుమా" అని మధు రంగా పాడుతూంది. సుందరం కమలను చూశాడు. కమల సుందరాన్ని చూసింది. రఘు చప్పట్లు చరుస్తూ కమల చంకలో నుంచి దిగి సుందరం కాళ్లను కావిలించు కొన్నాడు. పాట పూర్తికాగానే హార్మో నియం వాయిస్తున్నవాడు. "అయ్యా! బీదవారం - ఏదో దొరగారు దయ తల చాలి" అన్నాడు.

"ఆ అమ్మాయి నీకేం గావాలి" అన్నాడు సుందర. "కూతురండీ" అన్నాడు. "అమ్మాయి! మరొకపాట పాడు" అన్నది కమల. ఆ పిల్ల పాడింది. కమల ఆరునెలల క్రిందట కొన్న కొత్త చీర తెచ్చి ఆ అమ్మాయి కిచ్చింది. సుందరం జేబులో చెయ్యిపెట్టగానే దొరికినదాన్ని ఆ పిల్ల చేతికిచ్చాడు. వారి ధాతృత్వానికి ఆ జనసమూహము ఆశ్చర్యపడిపోయింది.

ఆ పిల్ల వెళ్లిపోయింది. కాని కమల సుందరం మనస్సులు ఆ పిల్ల కంఠధ్వనిలోనే లీనమైపోయినవి. ఆ పిల్ల వెళ్లిన వేపే చూస్తూ నిలబడిపోయారు. దూరంలో నుండి గాలి తరంగాల్లో "వృథా కలహముమాని" అన్నపాట మధురంగా వినబడుతూంది. కమల హృదయంలో ఆ ప్రబోధం స్థిరంగా నిల్చిపోయింది. తన

అవివేకానికి తన్నుతానే నిందించుకొంది. గాలి ఇప్పుడు ఆ పిల్ల పాటలను కమల చెవుల కందించడంలేదు. కాని కమల చెవుల్లో ఆ పిల్ల పాటలు ప్రతి ధ్వనిస్తూనే ఉన్నవి. సుందరం చాలా సిగ్గుపడ్డాడు. అధికారంతో కమలను అన్నందుకు నొచ్చుకొన్నాడు. "వంటైందా కమలం" అన్నాడు సుందరం కాళ్లు పట్టుకొన్న రఘు నెత్తుకొంటూ – కమల కోపం ఎగిరి పోయింది. "ఇప్పుడింకా తొమ్మిదిన్నరేగా, పదిహేను నిముషాల్లో వంటచేసి పెట్టేస్తాను" అని లోపలికి పరుగెత్తింది కమల.

సుందరం భోజనానికి కూర్చున్నాడు. నిజంగా సుందరం చాలా ఆశ్చర్యపడి పోయాడు. పదిహేను నిముషాల్లో అన్నం' పులుసు, పచ్చడిచేసిన కమల చాతుర్యానికి చాలా మెచ్చుకున్నాడు. వంట రుచిగా ఉంది. సుందరం పులుసన్నం సగం తిని "ఇవాళ నీచాతుర్యమా! గాయకి చాతుర్యమా" అంటూ నవ్వాడు. "పాటకి చాతుర్యమే. ఆ అమ్మాయి రాకపోతే పుట్టింటికి వెళ్లిపోయిఆరు నెలలదాకా మీరే మన్నా గడపత్రొక్కకూడదని నిశ్చయించాను". అన్నది. "అబ్బో! ప్లాను చాలా దూరం సాగిందే. నిన్ను నాకు దక్కనిచ్చినందుకు పాటకికి హృదయ పూర్వక ధన్యవాదాలు అర్పిస్తున్నాను" అన్నాడు. ఇద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

వేసవికాలంలో
మెదడును చల్లబరచి,
శిరోజములను నల్లబరచి,
కుదుళ్లను పదిలము చేయునది
కేసరిగారి
భృంగామలకతైలము
వెల రు. 2-0-0
వాడిచూడండి.
కేసరి కుటీరం లిమిటెడ్
రాయపేట, మద్రాసు 14.